సాక్షి శ్రీకాకుళం

బుధవారం ౹ 25 ౹ సెప్టెంబర్ ౹ 2024



పట్టుకోండి చూద్దాం..

చోరులు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఏకంగా ఖాకీల ఇళ్లలోనూ దొంగతనం చేస్తున్నారు. - 8లో



రైలు నుంచి జారి పడి..

రైలు నుంచి జారిపడిన ఘటనల్లో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. వీరిలో ఒకరి వివరాలు తెలియాల్సి ఉంది. - 8లో

నవోదయ దరఖాస్తుకు గడువు పెంపు

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం అక్టోబర్ 7 వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశు రామయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల్లో వివరాలు అక్టోబర్ 8,9 తేదీల్లో సవరించుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఫారెస్ట్ రేంజర్ల బదిలీ

అరసవల్లి: అటవీ శాఖలో బదిలీలు మొదలయ్యాయి. జిల్లాలో పాతపట్నం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్ఓ) రౌతు రాజశేఖర్‌ను రణస్థలం ఎఫ్ఆర్ఓగా బదిలీ చేశారు. రణస్థలం ఎఫ్ఆర్ఓగా పనిచేస్తున్న జి.జగదీశ్వరరావును టెక్కలి రేంజర్‌గానూ, నరసన్నపేటలో ఎఫ్ఆర్ఓగా పనిచేస్తున్న పి.అమ్మన్నాయుడును పాతపట్నం రేంజర్‌గానూ బదిలీ చేశారు. అలాగే శ్రీకాకుళం డివిజన్ పాలకొండ ఎఫ్ఆర్ఓ కె.తవిటినాయుడును పార్వతీపురం మన్యం డివిజన్ సాలూరు రేంజర్‌గానూ, సాలూరు ఎఫ్ఆర్ఓగా పనిచేస్తున్న కె.రామారావును పాలకొండ రేంజర్‌గానూ బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవ్ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు.

భారీ వానలకు అవకాశం



శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నదులు, వాగుల్లో ప్రవాహం పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాజ్ వే, వంతెనలపై నీరు ప్రవహించే చోట్ల పాదచారులు, వాహన చోదకులను నియంత్రించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08942–240557ను ఏర్పాటు చేశామని, ప్రజలు అత్యవసర సమయంలో ఫోన్ చేయాలని, సిబ్బంది వెంటనే అప్రమత్తమై తగు సహాయం చేస్తారని అన్నారు. మళ్లీ ఆదేశాలు ఇచ్చేంతవరకు అధికారులు వారు పని చేస్తున్న కేంద్రాలను విడిచి ఎవరూ వెళ్లరాదని, ప్రభుత్వ అధికారులకు సెలవులను పూర్తిగా రద్దు చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు.

టెట్ అభ్యర్థుల సెంటర్ ఇబ్బందులు

శ్రీకాకుళం న్యూకాలనీ: టెట్‌కు సిద్ధమవుతున్న జిల్లా అభ్యర్థులు పరీక్ష కేంద్రాల కేటాయింపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని మూడు కేంద్రాలతో పాటు బరంపురంలో మరో మూడు కేంద్రాలను వేలాది మందికి కేటాయించారు. పరీక్ష కేంద్రాలను వేరే రాష్ట్రాలకు కేటాయించడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నుంచి 14,311 మంది టెట్ రాయనున్నారు. వీరిలో బరంపురంలో మూడు కేంద్రాలకు 1874 మంది కేటాయించారు. ఇలా కేటాయించడం సరికాదని అభ్యర్థులు మండిపడుతున్నారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఓల్డ్ రెగ్యులేషన్ సప్లిమెంటరీ డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ మంగళవారం విడుదల చేశారు. వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞాన భూమి పోర్టల్‌లో వివరాలు అందుబాటులో ఉంచారు. మొత్తం 1154 మంది హాజరు కాగా, 822 మంది ఉత్తీర్ణత సాధించారు. బీఏలో 41 మందికి 34, బీఎస్సీలో 970 మందికి 723, బీసీఏలో ఒకరికి ఒకరు, బీకాం ఒకేషనల్‌లో 108 మందికి 43, బీకాం జనరల్‌లో 34 మందికి 21 మంది ఉత్తీర్ణత సాధించారు. 71.23 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

కొత్తమ్మ తల్లి జాతరకు పటిష్ట ఏర్పాట్లు



కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి సన్నిధిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

కోటబొమ్మాళి: అక్టోబర్ 1 నుంచి 3 వరకూ జరగనున్న కొత్తమ్మ తల్లి జాతర నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. వారు మంగళవారం కొత్తమ్మ తల్లిని దర్శించుకుని జాతర నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గుడి పరిసరాల్లో సీసీ కెమెరాలకు పోలీస్ కంట్రోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.రాధాకృష్ణ, జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, ఎస్ఐ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.





● అమ్మ ప్రేమ

బిడ్డ నడిరోడ్డుపై ఆదమరిచి బజ్జుంది. మనుషులేమో ఊరికే హారన్లు కొడుతూ అటూ ఇటూ బళ్లు నడుపుతున్నారు. వారెక్కడ వాహనాలతో తన బిడ్డను తొక్కేస్తారోనని ఆ గోమాత కంగారు పడిపోయింది. దూడ నిద్రిస్తున్నంత సేపూ అడ్డంగా నిలుచుని కాపలా కాసి అమ్మప్రేమను చూపించింది. శ్రీకాకుళం పాలకొండ ప్రధాన రహదారిలో మంగళవారం ఈ దృశ్యాలు కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

● సారూ.. స్పందిస్తారా మీరు

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి భూలోకమాత వీధి వద్ద ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి మురుగు నీరు చేరింది. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడంతో తల్లిదండ్రులు కూడా పిల్లలను బడికి పంపడానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

– టెక్కలి



రాయబేరాలు కుదరక..



- టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య అంతర్గత పోరు
- కలిసికట్టుగా దోచుకోవడానికి పారని ప్లాన్
- కలమట వద్దకు రాయ'బేరం'
- కుమ్మక్కై కొట్టేయడానికి ఒప్పుకోని కలమట
- కలమటపై మామిడి పరోక్ష వ్యాఖ్యల దాడి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పాతపట్నం టీడీపీలో ఇసుక దుమారం తీవ్ర స్థాయికి చేరింది. కలిసికట్టుగా దోచుకోవడానికి వేసిన పన్నాగం పారకపోవడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలో అసహనం పెరిగిపోయింది. అధికారంలో ఉన్న ఐదేళ్లు చేసిందిదే కదా అని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణపై ప్రస్తుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేసి కాక రేకెత్తించారు. పాతపట్నంలో కొత్తగా జరుగుతున్న ఈ పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయో చూడాలి. ఇసుక కోసం రాజీపడదామని, కలిసికట్టుగా చేస్తే ఎవరూ అడ్డుకోలేరని, ఏకతాటిపై నడవకపోతే సంపాదించుకోలేమన్న భావనలో మామిడి శిబిరం ఉంది. వాళ్లతో కలిసి అక్రమాలు చేయలేమని కలమట శిబిరం చెప్పకనే చెప్పేయడంతో పాతపట్నంలో టీడీపీ రాజకీయం ఆసక్తికరంగా మారింది.

ఇసుకతో రూ.కోట్లకు పడగలెత్తేయాలన్న ఆలోచనతో తెలుగు తమ్ముళ్లు ఉన్నారు. ఇప్పటికే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడుతున్నారు. స్థానికులు ఫిర్యాదులు చేశాక కొందరు దొరికిపోతున్నారు. ఇంకొందరు తమను అడ్డుకునేదెవరని దూకుడుగా దందా సాగిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అని టన్నుకు రూ.340 వసూలు చేస్తుంటే అక్రమ ఇసుకను విక్రయిస్తామని చెప్పి 18 టన్నుల లారీకి రూ.40వేల వరకు తమ్ముళ్లు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది.

ఇరకాటంలో ఎమ్మెల్యే శిబిరం..

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఇసుక దందా నడుస్తోంది. జిల్లాలో పాతపట్నంలో తప్ప మిగతా అన్ని నియోజకవర్గాలపై ఒకే మాటపై ఇసుక దోపిడీ జరుగుతోంది. పాతపట్నంలో మాత్రం ప్రస్తుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే కలమట మధ్య విభేదాలతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిని అడ్డుకునే పనిలో కలమట వర్గం ఉంది. ఒడిశా నుంచి తీసుకొస్తున్నట్టుగా అక్కడి రశీదులు చూపించి పాతపట్నం నియోజకవర్గం నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను పట్టుకోవడం కూడా జరిగింది. ఈ వ్యవహారం ఒక్కసారిగా కలకలం రేపింది. స్వపక్షంలోనే అడ్డుకోవడం పార్టీ వర్గాలను సైతం కుదిపేసింది. ఇలాంటి పరిస్థితుల మధ్య కొత్తగా అధికారం దక్కించుకున్న నేత శిబిరంలో కలవరం మొదలైంది. మనం చేసే ప్రతి పనిని కలమట వర్గం అడ్డుకుంటుందనే అభద్రతా భావంలో ఉండటమే కాకుండా అటువైపు నుంచి అలాంటి సంకేతాలు రావడంతో ఇసుకతో సంపాదించుకోలేమోనన్న ఆందోళన చోటు చేసుకుంది. దీంతో ఇకపై రాజీపడి ఇసుకతో పైసలు వెనకేసుకుందామనే ప్లాన్‌తో ఇటీవల ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శిబిరం నుంచి ఎన్.అప్పన్న అనే వ్యక్తి మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ వద్దకు వెళ్లారు. అంతర్గతంగా విభేదించుకుంటే నష్టపోతామని, నాలుగు పైసలు వెనకేసుకోవాలంటే కలిసి పనిచేద్దామని ప్రతిపాదించారు. దానికి కలమట వెంకటరమణ ఒప్పుకోలేదు. ఇసుక కోసం కలిసి పని చేసేది లేదని, ఇంకెప్పుడూ ఇలాంటి మధ్యవర్తిత్వానికి రావద్దని నిర్మోహమాటంగా చెప్పేశారు. దీంతో ఎమ్మెల్యే శిబిరం ఇరకాటంలో పడింది. ఆ ఆక్రోశంతోనే మాజీ ఎమ్మెల్యే కలమటపై ప్రస్తుత ఎమ్మెల్యే పరోక్షంగా మాట దాడికి దిగారు.

దొంగే.. దొంగ అన్నట్టుగా..

2014 నుంచి 2019లో టీడీపీ ప్రభుత్వంలో దొరికినంత ఇసుక అమ్ముకున్న వ్యక్తులే ఇప్పుడు నిజాయితీ పరులుగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని, నన్ను చూసి ఓర్వలేని స్వపక్ష నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దొంగే దొంగ అని అరుస్తున్నట్టు ఉందని మాజీ ఎమ్మెల్యే కలమటపై ఎమ్మెల్యే మామిడి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఈ కామెంట్స్ చేసిన రోజుల వ్యవధిలోనే తానెంత నిజాయితీ పరుడినో...ఇసుకకు తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకునేందుకు ఇటీవల ఒడిశా నుంచి వస్తున్న ఇసుక లారీలను అడ్డుకుని హంగామా చేశారు. ప్రస్తుతం నియోజకవర్గం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని పరోక్షంగా ఒప్పుకున్నారు. ఈ సందర్భంగా కూడా 2014–19లో టీడీపీ హయాంలో జరిగిన అక్రమాలను కోట్ చేస్తూ మీడియా ముందు మాట్లాడారు. ఇదంతా చూస్తుంటే ఇసుక కోసం టీడీపీ సిట్టింగ్, మాజీల మధ్య గట్టిగానే వార్ నడుస్తున్నట్టు అర్థమవుతోంది.

సీబీఐతో విచారణ జరిపించాలి

- లడ్డూ వివాదంలో రాజకీయ కోణం
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: హిందువుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని ఏపీ మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన మంగళవారం ఆమదాలవలసలో మీడియాతో మాట్లాడారు. లడ్డూ వివాదం వెనుక దాగి ఉన్న రాజకీయ కుట్రపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ హయాంలో టీటీడీ ప్రతిష్టను అత్యున్నత స్థితికి చేర్చారని గుర్తు చేశారు. నెయ్యి క్వాలిటీ విషయంలో టీటీడీ ప్రయోగశాలలో నిర్వహించిన పరీక్షల్లో నాణ్యత సరిగ్గా లేని నెయ్యి ట్యాంకర్లను 14 సార్లు చంద్రబాబు హయాంలో వెనక్కి పంపిస్తే, 18 సార్లు వైఎస్ జగన్ పాలనలో వెనక్కి పంపించినట్లు తెలిపారు. సాధారణంగా కల్తీ చేయాలనుకునే వ్యాపార సంస్థలు పామాయిల్, హైడ్రోజనేటెడ్ కూరగాయల కొవ్వు కలుపుతారని, తక్కువ వ్యయంతో ఎక్కువ లాభార్జన చేసేందుకు కొంత మంది కల్తీదారులు ఇలా కుట్రలు చేస్తారని వివరించారు. కోట్ల మంది స్వామి వారి భక్తులను తీవ్ర ఆందోళనలోకి నెట్టే పని చేయాల్సిన అవసరం కూటమి ప్రభుత్వానికి ఎందుకు వచ్చిందో ప్రజలు గమనించాలన్నారు. లడ్డూ తయారీకి మెటీరియల్ ఎవరు సరఫరా చేసినా, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబరేటరీస్ సర్టిఫై చేయాల్సి ఉందన్నారు. గడిచిన ఐదేళ్లలో లడ్డూ కోసం వాడిన ప్రతి పదార్థాన్ని ఈ ల్యాబొరేటరీ నిర్ధారణ చేసిందన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రస్తుత కళింగ కుల అధ్యక్షుడు దుంపల రామారావు, బూర్జ ఎంపీపీ కర్ణేన దీప, బూర్జ జెడ్పీటీసీ బెజ్జి పురుషు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, బూర్జ మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజుని తక్షణమే అరెస్ట్ చేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ పరిధిలోని కాళ్ల మండలం ఏలూరుపాడులో ఓ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి తొలగించడంపై దళిత సంఘాలు మండిపడుతున్నాయి. రాజ్యాంగ నిర్మాతను అవమానించిన రఘురామకృష్ణం రాజుపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలో మంగళవారం దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డే అండ్ నైట్‌కూడలి నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలియజేసి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం దళిత సంఘాల జేఏసీ నేతలు ఎస్పీ మహేశ్వర రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రజలు వాస్తవాలు గ్రహించాలి

● జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



కంచిలి: తిరుమల లడ్డూపై జరుగుతున్న వివాదంలో ప్రజలు వాస్తవాలను గ్రహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఈ విషయమై ఆమె తన కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. లడ్డూ తయారీకి మెటీరియల్ ఎవరు సరఫరా చేసినా.. వారు పంపించిన నెయ్యి ట్యాంకర్‌తో పాటు, ఎన్ఏబీఎల్(నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబరేటరీస్) సర్టిఫై చేసిన ల్యాబ్ నుంచి క్వాలిటీ సర్టిఫికెట్ తీసుకు రావాల్సి ఉంటుందని, ఇలాంటి ఉత్తమ విధానాలు కొన్నేళ్లుగా టీటీడీ పాటిస్తోందని వివరించారు. ప్రతి ట్యాంకర్‌కూ మూడు శ్యాంపిల్స్ తీసి మూడు టెస్టులు చేస్తారని, అవన్నీ పాస్ అయితేనే ఆ నెయ్యిని టీటీడీ ప్రసాదంలో వాడతారని, లేకపోతే తిప్పి పంపిస్తారన్నది వాస్తవం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2014–19 మధ్య చంద్రబాబు పాలనలో దాదాపు 14 సార్లు అలా నెయ్యి, ఇతర సరుకులను క్వాలిటీ లేవని తేలడంతో వెనక్కి పంపారని, ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2019–24 మధ్య 18సార్లు క్వాలిటీ టెస్టులో మంచి రిపోర్టు రానివి పంపిన మాట వాస్తవం కాదా అని అన్నారు. చంద్రబాబు.. మీరు అధికారంలోకి వచ్చింది జూన్ 12న, శ్యాంపిల్స్ తీసుకున్నది జూలై 12న, ల్యాబ్ నుంచి ఫలితాలు వచ్చింది జూలై 23న మరి ఆరోపణలు ఎదుర్కోవాల్సింది మీరా?మేమా? అని నిలదీశారు. అసలు రిపోర్టు జూలై 23న వస్తే.. రెండు నెలల పాటు ఎందుకు మౌనంగా ఉండాల్సి వచ్చిందన్నారు.

ఇసుక తోడేళ్లు

- మాకివలసలో ఇసుక పోగులు మాయం
- రాత్రి, పగలు అక్రమంగా రవాణా



ఇసుక పోగులు మాయం చేసిన అనంతరం ఉన్న ఆనవాళ్లు

జలుమూరు: మండల పరిధి వంశధార నదీతీర గ్రామాలలో ఇసుక దందా విపరీతంగా జరుగుతోంది. ప్రధానంగా మాకివలస, ఉడకలపేట, రామకృష్ణాపురం గ్రామాల్లో నిన్నటి వరకూ చాటుమాటుగా సాగిన ఈ వ్యవహారం ఇప్పుడు మాకివలస కేంద్రంగా బహిరంగంగానే సాగుతోంది. రెవెన్యూ, పోలీసు శాఖలు ఏమీ చేయలేకపోతుండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మాకివలసలో ఇసుక అక్రమ రవాణాపై ఎస్పీ మహేశ్వర రెడ్డికి ఫిర్యాదులు అందడంతో ఈ నెల 15 వేకువజామున ప్రత్యేక బృందాలతో దాడి చేయించి మూడు లారీలు, ఒక కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. కానీ ఆ తర్వాత మళ్లీ వ్యాపారం యథావిధిగానే సాగుతోంది.

రాత్రి పగలు తేడా లేకుండా..

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో కేవలం రాత్రిపూట మాత్రమే ఇసుక తరలింపు జరిగేది. కానీ ఇప్పుడు అందరూ చూస్తుండగానే పగటి పూట కూడా ఇష్టానుసారం ఇసుక తవ్వి తీసుకెళ్తున్నారు. నది నుంచి కొమనాపల్లి వరకూ ట్రాక్టర్‌కు రూ. ఐదు నుంచి రూ.ఆరు వేలు కాగా లారీకు విశాఖ తదితర ప్రాంతాలకు రూ.50 వేలు నుంచి రూ.60 వేలు వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు.

మాకివలసలో ఇసుక పోగులు మాయం

మాకివలస కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు అందడంతో ఆయా వాహనాలు సీజ్ చేయించారు. అదే సమయంలో కళ్లాల్లో ఉన్న ఇసుక పోగులు అలాగే ఉండిపోయాయి. వీటిని సుమారు వారం రోజుల వరకూ అలాగే ఉంచారు. కానీ ఇప్పుడా పోగులు కనిపించడం లేదు. లారీలు, ట్రాక్టర్లతో తరలించుకుపోయారు. దీనిపై తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణ వివరణ కోరగా సిబ్బందికి డ్యూటీలు వేసి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు. ఎస్ఐ అశోక్ బాబు మాట్లాడుతూ సిబ్బందితో గస్తీ ఏర్పాట్లు చేశామన్నారు.

తెలుగు తమ్ముళ్ల బరితెగింపు



ఈ ఫొటో చూడండి. ఆమదాలవలస మండలం తొగరాం పంచాయతీ నాగావళి నది పక్కనున్న దిబ్బలపేటలో అక్రమంగా పోగేసిన ఇసుక దిబ్బలు. సాయంత్రం 6.30 గంటల తర్వాత ఇక్కడ విక్రయాలు జరుగుతున్నాయి. అక్రమార్కులు ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేయించుకుని అనధికారికంగా ఇసుక విక్రయిస్తున్నారు. లారీ ఇసుకకు రూ. 35వేల నుంచి రూ. 40వేల వరకు తీసుకుంటున్నారు. విజయనగరం, విశాఖపట్నంకే ఇక్కడ ఇసుక దాదాపు తరలివెళ్తోంది.



ఈ చిత్రంచూడండి. ఆమదాలవలస మండలం తొగరాం పంచాయతీ దిబ్బలపేట ఇటుక బట్టీల ఏరియాలో డంపింగ్ చేసిన ఇసుకను లారీల్లోకి జేసీబీల ద్వారా లోడింగ్ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 6.30గంటల సమయంలో జరిగిన పరిణామమిది. ఒక్కో లారీకి రూ.35వేల నుంచి రూ. 40వేల వరకు తీసుకుంటున్నారు.

- ఇసుక నిలువు దోపిడీ
- నాగావళి నదిలో తవ్వి, పక్కనున్న తోటల్లో ఇసుక డంపింగ్
- సాయంత్రం 6 తర్వాత విక్రయాలు
- కళ్ల ముందు కనిపిస్తున్నా పట్టించుకోని అధికారులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా పథకం ప్రకారం జరుగుతోంది. అధికారులకు అంతా తెలిసే దందా నడుస్తోంది. ఒకటి రెండు చోట్ల పట్టుకుని మిగతా చోట్ల చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. స్థానిక ఫిర్యాదులతో స్పందించామని చెప్పుకునేందుకు అక్కడక్కడ హడావుడి చేస్తున్నారు. ఆమదాలవలస మండలం తొగరాం పంచాయతీ దిబ్బలపేట ఇటుక బట్టి ఏరియాలో, సమీపంలోని తోటల్లో నాగావళిలో అక్రమంగా తవ్వి తీసిన ఇసుకను డంప్ చేసి, అక్కడి లారీల్లోకి జేసీబీలతో లోడింగ్ చేసి తరలిస్తున్నారు. రోజుకి రూ. లక్షల్లో ఇసుక ద్వారా సంపాదిస్తున్నారు.

పక్కా ప్లాన్ ప్రకారం

పక్కా ప్లాన్‌తో ఇసుక దోపిడీ చేస్తున్నారు. రాత్రిళ్లు నాగావళిలో ఇసుకను తవ్వితీసి డంప్ చేస్తున్నారు. తోటల్లోనూ, ఇటుక బట్టీల ఏరియాలో గుట్టలు గుట్టలుగా వేసి ఉంచుతున్నారు. మరుసటి రోజు సాయంత్రం 6.30గంటల తర్వాత విక్రయాలు చేపడుతున్నారు. విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెంది న వారికే విక్రయిస్తున్నారు. లావాదేవీలన్నీ ఫోన్‌లోనే జరిగిపోతున్నాయి. పొరుగు జిల్లాల వారికి ఇక్క డ ఇసుక దొరుకుతుందనే సమాచారం ముందే పంపిస్తున్నారు. కొందరి ఫోన్ నం బర్లు ఇస్తున్నారు. ముఖ్యంగా ఇసుక రవాణా చేసే ఓనర్లు, డ్రైవర్లతో సంబంధాలు పెట్టుకున్నారు. వారే నేరుగా ఫోన్ చేసి బుకింగ్ చేసుకుంటున్నారు. ఫోన్‌పే ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఒకేసారి డంపింగ్ ఏరియాకు లారీలు రాకుండా పక్కనున్న నారిపేటలో పార్క్ చేయిస్తున్నారు. ఒకేసారి అన్నీ లారీలు డంపింగ్ ఏరియాకు వస్తే రభస అయిపోతుందని ప్లాన్ ప్రకారంగా దందా సాగిస్తున్నారు.

మేనల్లుళ్ల దందా

నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధి మేనల్లులే ఇక్కడ ఇసుక దోపిడీ చేస్తున్నారు. మంగళవారం కొందరి ఫిర్యాదు మేరకు అధికారులు అక్కడికి వెళ్లి చూసినా చర్యలు తీసుకోలేదు. కీలక ప్రజాప్రతినిధి వార్నింగ్‌తోనే అక్రమ తవ్వకాలు, తరలింపు ఆపకుండా చేతులెత్తేశారు. దిబ్బలపేట సమీపంలోని నాగావళిలో జరుగుతున్న తవ్వకాలతో చుట్టు పక్కల గ్రామాలకు ముప్పు వాటిల్లనుంది. వరద పెరిగితే నదీ గమనం మారుతుంది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు హర్షద్


హర్షద్

ఆమదాలవలస: 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న బాక్సింగ్ పోటీల్లో ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి డి.హర్షద్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. విద్యార్థిని హెచ్‌ఎం తోపాటు పీఈటీ బి.పాపినాయుడు, శేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు చంద్రకళ


చంద్రకళ

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గోకవలస చంద్రకళ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం సాయి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయిలో రెండు రోజుల క్రితం జరిగిన పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పీడీ కె.గణపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

తండ్రిపై కుమారుడి దాడి

నందిగాం: మండలంలోని కణితూరుకు చెందిన అన్నెపు మోహనరావుపై ఆయన మూడో కుమారుడు విజయానందం మంగళవారం దాడి చేసి గాయపరిచాడు. నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మోహనరావుకు ముగ్గురు కుమారులు. వారికి మూడు ఇళ్లు కూడా కట్టి పంపిణీ చేశాడు. అయితే మూడో కుమారుడైన విజయానందం తనకు వేరే ఇల్లు కావాలని, అందుకు సంబంధించిన పత్రాలపై సంతకం చేయాలని తండ్రిపై ఒత్తిడి చేశాడు. అందుకు తండ్రి ఒప్పుకోకపోవడంతో దాడి చేసి గాయపరిచాడు. దీంతో మోహనరావును చికిత్స కోసం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూరగాయల టెండర్లు ఖరారు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో వసతి గృహాలకు కూరగాయలు సరఫరా చేసే టెండర్లు మంగళవారం ఖరారు చేశారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎన్.లోకేశ్వరి సమక్షంలో 36 రకాల కూరగాయల సరఫరాకు ఏడుగురు టెండర్లు వెయ్యగా తక్కువకు కోట్ చేసిన వారికి టెండర్లు ఖరారు చేశారు. ఈ సందర్భంగా చీఫ్ వార్డెన్ మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నామని, జ్వరాలు వ్యాప్తి చెందకుడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

తమ్ముడిని హత్యచేసిన వారిని శిక్షించాలి


జిల్లా పోలీసు కార్యాలయం వద్ద బాధితులు

శ్రీకాకుళం క్రైమ్ : తన తమ్ముడిని చంపిన నిందితులను కేసు నుంచి రణస్థలం పోలీసులు తప్పించారని.. తక్షణమే వారిని శిక్షించాలని విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం అల్లాడపేటకు చెందిన గొర్లె గంగమ్మ మంగళవారం శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. తన తమ్ముడు కొలుసు బంగారప్పడు అలియాస్ చిన్న (25) పైడి భీమవరంలో అరబిందో కంపెనీలో పనిచేస్తుండేవాడని.. ఈ నెల 8న సాయంత్రం ఐదు గంటలకు కొంతసొమ్మును తీసుకుని మిత్రులకు కలవడానికి వెళ్లాడని.. మరుసటిరోజు ఉదయాన్నే చనిపోయాడని కబురొచ్చిందని పేర్కొన్నారు. తన తమ్ముడిని కె.వెంకటఅప్పారావు, పిడుగు శ్రీనులు కొట్టిపడేశారని.. వారి ఇంటి వద్ద రక్తపు మరకలతో ఉండగా దుస్తులు, దాడికి ఉపయోగించిన కర్రను రణస్థలం పోలీసులు స్వాధీనపర్చుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ పోలీసులు కేసులో వారి పేర్లు తప్పించారని, తమ్ముడి చావుకు కారణమైన వారిని శిక్షించాలని ఆమె ఎస్పీకి విన్నవించారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ న్యాయం చేస్తామన్నారు.

బాధితురాలిని విచారించిన సీఐ

శ్రీకాకుళం క్రైమ్ : డీఎంహెచ్‌వో కార్యాలయంలో జాబ్ వస్తుందని నమ్మి డబ్బులు కట్టి ఓ కాంట్రాక్టు ఉద్యోగి చేతిలో మోసపోయిన వివాహిత జిల్లాకేంద్రంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు ఇంటికి డిశ్చార్జి అయ్యి రావడంతో ఒకటో పట్టణ సీఐ సిహెచ్ పైడపునాయుడు మంగళవారం ఆమె నివాసానికి వెళ్లి విచారణ చేపట్టారు. వైద్య శాఖ కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ గుజ్జల వరాహ నర్సింహం తనకు డేటా ఎంట్రీ ఆపరేటర్ జాబ్ ఇప్పిస్తాడని నమ్మించి రూ. 2 లక్షలు తీసుకున్నాడని.. నకిలీ నియామకపత్రం ఇచ్చి ఉద్యోగమొచ్చినట్లు నమ్మించాడని, ఉద్యోగం ఇప్పించానని కారణంతో మానసికంగా, శారీరకంగా వేధించేవాడని ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. ఎస్పీకి నివేదిక అందజేస్తామని, ఆయన సూచనల మేరకు న్యాయం జరిగేలా చూస్తామని సీఐ హామీ ఇచ్చారు.

పట్టుకోండి చూద్దాం!

- వరుస చోరీలతో పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- సామాన్యులే కాక ఖాకీల ఇళ్లల్లోనూ దోపిడీలు
- నిద్రపోతున్న నిఘా వ్యవస్థ


ఇచ్ఛాపురంలో చోరీకి గురైన షాపు వద్ద పోలీసులు(ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : తాళం వేసి ఇళ్లు.. పూజలు చేస్తున్న గుళ్లు.. సేవలందిస్తున్న సచివాలయాలు.. డబ్బులు ఇచ్చే ఏటీఎం సెంటర్లు.. ఇలా ఒకటేమిటీ కాదేదీ చోరీకి అనర్హం అన్నట్లు దొంగలు రెచ్చిపోతున్నారు. ఆఖరికి పోలీసుల ఇళ్లకు కూడా కన్నమేస్తూ ఖాకీలకే సవాల్ విసురుతున్నారు. పోలీసులు మాత్రం పెట్రోలింగ్ చేపుడుతున్నాం.. బీట్‌లు పెంచుతున్నాం.. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నాం.. అన్న మాటలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అంతర్రాష్ట్ర ముఠాలు జిల్లాలో చొరబడుతున్నా ముందుగానే పసిగట్టాల్సిన నిఘా బృందాలైన సీసీఎస్, స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్సు వర్గాలు ఏం చేస్తున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల చోరీలను పరిశీలిస్తే..

- ఈ నెల 18న రాత్రి ఫరీద్‌పేట పదోలైన్‌లో ఉపాధ్యాయ దంపతులైన రామ్మూర్తి, రమాదేవిలు ఇంట్లో లేని సమయం చూసి 13 తులాల బంగారు నగలు, కిలో వెండి అపహరించుకుపోయారు. అదే రోజు రాత్రి, అదే ఫరీద్‌పేట మూడో లైన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తండ్రి (ఈయన కూడా రిటైర్డ్ ఉపాధ్యాయుడే) బొడ్డేపల్లి రామారావు ఇంట్లో చోరీ జరిగింది. రెండున్నర కిలోల వెండి, అర తులం బంగారం దొంగిలించారు.
- ఈ నెలన 14న రాత్రి ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట రంగనాథస్వామి ఆలయంలో గర్భగుడి తలుపుల తాళాలను పగులగొట్టి రెండు హుండీలను ధ్వంసం చేసి 4 తులాల బంగారం, 6 కిలోల వెండి, నగదు పట్టుకుపోయారు.
- ఈ నెల 16న రాత్రి పొందూరు మండలం నందివాడ బాలయోగి ఆశ్రమంలో 8 కిలోల వెండి ఆభరణాలు, 2 తులాల బంగారు ఆభరణాలు, హుండీలో రూ. 1 లక్షకు పైగా నగదు దోచుకెళ్లారు.
- ఈ నెల 9 రాత్రి ఎచ్చెర్ల మండలం కుంచాల కురమయ్యపేట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి అలంకరించిన ఆరు కిలోల వెండి, తులం బంగారం చోరీకి గురైంది.
- ఈనెల 17న రాత్రి ఇచ్ఛాపురం పట్టణంలోని మెయిన్‌రోడ్డులోని మూడు షాపుల్లో రూ. 25 వేల నగదు దొంగిలించారు.
- ఆగస్టు 29న రాత్రి ఎచ్చెర్ల మండలం నవభారత్ సమీపంలోని సీపాన వెంకటరమణ ఇంట్లో బీరువా తాళాలు విరగ్గొట్టి రెండున్నర తులాల బంగారం పట్టుకుపోయారు.
- ఈ నెల 2న రాత్రి హిరమండలం దుర్బలాపురంలో బాలకామేశ్వరస్వామి ఆలయంలో తాళాలు పగులగొట్టి దేవుని పంచలోహ, ఇత్తడి విగ్రహాలు 40 కిలోల వరకు దొంగిలించారు.
- ఆగస్టు 18 రాత్రి సారవకోట మండలం బుడితి పెల్లేటి చెరువుగట్టుపై ఉన్న విజయకనకదుర్గ అమ్మవారి హుండీలో నగదు కాజేశారు. ఇదే గుడిలో మూడు సార్లు చోరీ జరగడం గమనార్హం. అదేరోజు పక్కన ఉన్న చీడిపూడి రైస్‌మిల్లులో 1.30 లక్షలు, బుడితిలో అయ్యప్పస్వామి, షిర్డీ సాయి దేవాలయాల్లో కూడా చోరీలు జరిగాయి.
- ఆగస్టు 28న రాత్రి జలుమూరు మండలం అంధవరం పంచాయతీ రామకృష్ణాపురంలో రేగాన కృష్ణమూర్తి ఇంట్లో మూడు తులాల బంగారం, కొంత వెండి, నగదుచోరీకి గురయ్యాయి.
- టెక్కలిలో జూన్ జూలై నెలల్లో 30 రోజుల వ్యవధిలో 15 వరుస చోరీలు చేస్తూ దొంగలు సంచలనం సృష్టించి పోలీసులకు సవాల్‌గా మారారు.
- ఈ నెల 2న మబగాంలో నాగళ్ల నాగరాజు ఇంట్లో ఎనిమిది తులాలు బంగారం చోరీ జరిగింది. ఈ కేసులో మాత్రమే పోలీసులు రికవరీ చేసి నిందితులను పట్టుకున్నారు.

కానరాని రికవరీ..



- నరసన్నపేట ఇందిరానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్లో దంత వైద్యులు గురుదేవ్ నివాసంలో ఎవరూ లేని సమయం చూసి గతేడాది డిసెంబరు 3న 96 తులాల బంగారు ఆభరణాలు, రూ. 4.5 లక్షలు బంగారం దొంగలు అపహరించుకుపోయారు. సీసీ ఫుటేజీల్లో నేరస్థులు కనిపించినా ఇప్పటికీ ఈ కేసు కొలిక్కి రాలేదు.
- ఈ ఏడాది ఏప్రిల్ 24న ఎచ్చెర్ల మండలం దోమాం పంచాయతీ కుంచాల కురమయ్యపేట దేవీపీఠంలోని రాజరాజేశ్వరి ఆలయంలో దొంగలు పడి 30 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి, రూ.11 లక్షల నగదు పట్టుకుపోయారు. ఐదు నెలలు కావస్తున్నా కేసులో పురోగతి లేదు.
- ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటలో లలితా త్రిపుర సుందరి ఆలయంలో 7 తులాల బంగారం, 30 కిలోల వెండి చోరీకి గురై ఏడాది కావస్తున్నా ఇప్పటికీ పోలీసులు రికవరీ చేయలేకపోయారు.

ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నాం..



జిల్లాలో చోరీల విషయం నా దృష్టికి వచ్చింది. ఎస్పీతో చెప్పి ఇప్పటికే ప్రత్యేక బృందాలు వేయించాం. వారు గాలిస్తున్నారు. ఇప్పటికే కొంత మందిని గుర్తించాం. ఇటీవల జైలు నించి విడుదలైన పాత ముద్దాయిలపై ప్రత్యేక నిఘా పెట్టాం. పాత కేసుల్లో కూడా రికవరీ చేయలేనివి ఉన్నాయి. వాటి పురోగతిలో జాప్యానికి కారణాలు తెలుసుకుంటాం. – గోపినాథ్ జెట్టి, డీఐజీ, విశాఖ రేంజి

ఎ.జి.రోడ్డులో కూలిన కల్వర్టు


కూలిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ కొణపల సురేష్

కంచిలి: మండలంలోని అంపురం నుంచి ఘాటీము కుందాపురం వెళ్లే రోడ్డులో నారాయణబట్టి గ్రామం వద్ద కల్వర్టు మంగళవారం ఉదయం కూలిపోయింది. ఎవరికి ప్రమాదం జరగనప్పటికీ రెండు వైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరడం, ఇటీవల కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతినడంతోకూలిపోయింది. కల్వర్టు కూలడంతో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలకు కొన్నింటికి రాకపోకలు నిలిచిపోయాయి. కల్వర్టు అవతలివైపు ఉన్న గ్రామాలకు కంచిలి నుంచి రాకపోకలు సాగించేవారు కేసరపడ రోడ్డు మార్గంలో వెళుతున్నారు. రోడ్డు సామర్థ్యానికి మించి భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఈ రోడ్డులో ఉన్న మిగిలిన కల్వర్టులకు కూడా ప్రమాదం పొంచి ఉందని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చెబుతున్నారు. భైరిపురం వద్ద గ్రానైట్ క్వారీ నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించడం కూడా కల్వర్టు కూలడానికి కారణమైనట్లు స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్ కల్వర్టును పరిశీలించారు. ఆయనతోపాటు ఆర్‌అండ్‌బీ ఏఈ మోహనరావు ఉన్నారు. అంతకుముందు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ కొణపల సురేష్ తదితరులు కూలిన కల్వర్టు వద్దకు వచ్చి పరిశీలించారు.

అనధికార చిల్డ్రన్ హోమ్‌లు మూసివేత


లవ్లీ చిల్డ్రన్ హోమ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పాతపట్నం: పాతపట్నంలో అనధికారికంగా నడుపుతున్న రెండు చిల్డ్రన్ హోమ్‌లను మూసివేసినట్లు జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న లవ్లీ చిల్డ్రన్ హోమ్, అంతరాబ రోడ్డు సమీపంలో ఉన్న బ్లెస్ చిల్డ్రన్ హోమ్‌ను మంగళవారం తనిఖీ చేయగా.. రికార్డులు, రిజిస్ట్రేషన్, వసతి గృహం, మరుగుదొడ్లు సక్రమంగా లేవని గుర్తించామన్నారు. లవ్లీ హోమ్‌లో 24 మంది చిన్నారులుంటే 70 మంది ఉన్నట్లు బయటకు తెలియజేసి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇటీవల పిల్లలతో వీడియో తీసి సోషల్ మీడియాలో కూడా పెట్టారని చెప్పారు. వీరంతా ఒడిశాకు చెందిన చిన్నారులని, వీరిని బీసీ వెల్ఫేర్ వసతి గృహానికి అప్పగించామన్నారు. బ్లెస్ చిల్డ్రన్ హోమ్‌లో 11 ఒడిశా చిన్నారులు ఉండగా.. రికార్డులు లేకపోవడం, మెనూ సక్రమంగా లేనందున మూసివేసినట్లు వివరించారు. తనిఖీల్లో డీపీవో డి.వి.రవికుమార్, కౌన్సిలర్లు డి.సీతారాములు, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి డి.వి.రాజు, చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు యు.శ్రీలక్ష్మి, ఎం.గన్నెప్పడు, వి.రమణమూర్తి, సుధీర్, సీడీపీవో విమలరాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అనూరాధ, స్వప్న, హాస్టల్ వార్డెన్లు ఝాన్సీ, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు


ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ముందు ఆందోళన చేస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని 193 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం చలో బేవరేజెస్ కార్పొరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 722 మంది సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్‌లు, సెక్యూరిటీ సిబ్బంది ఆందోళనలో పాల్గొని అనంతరం ఎచ్చెర్ల బోటలింగ్ యూనిట్ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులకు ఉద్యోగ భద్రత కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు ధర్మారావు, వి.శ్రీనివాసరావు, సంతోష్, బుల్లిబాబు, మాట్లాడుతూ గత ప్రభుత్వం జేసీ అధ్యక్షతన ఎంపిక కమిటీ ఏర్పాటు చేసి, విద్యార్హత బట్టి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చిందని అన్నారు. డిగ్రీ అర్హతతో సూపర్ వైజర్‌కు రూ.25000, ఇంటర్మీడియెట్ అర్హతతో సేల్స్ మ్యాన్‌కు రూ. 20,000, పదో తరగతి అర్హతతో సెక్యూరిటీ గార్డుకు రూ. 10,000 వేతనం అందజేశారని అన్నారు. ఐదేళ్ల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించాక కొత్త ప్రభుత్వం తమను రోడ్డున పడేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేతనాలపై ఆధారపడి కుటుంబాలు బతుకుతున్నాయని, వయసు పెరిగిన నేపథ్యంలో కొత్త ఉద్యోగాలు తెచ్చుకోవడం సాధ్యం కాదని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలని కోరారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో విద్యార్హత బట్టి తమకు ఉద్యోగాలు కల్పించాలని అన్నారు. లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికలు ముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను తొలగించటం ఎంత వరకు ధర్మమని ప్రశించారు. ప్రభుత్వం తమ నిర్ణయం ప్రకటించి న్యాయం చేయాలని, లేదంటే భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేసి పోరాటం ముందుకు తీసుకువెళతామని చెప్పారు.

పోర్టుకు ఇచ్చిన 350 ఎకరాల్లో రీసర్వే

- మూలపేట పోర్టు నిర్వాసితులతో అచ్చెన్నాయుడు
- జూన్ 12 నాటికి మొదటి షిప్ రావాలని వ్యాఖ్య


నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: వచ్చే ఏడాది జూన్ 12 కల్లా మూలపేట పోర్టులో మొదటి షిప్ ల్యాండ్ కావాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఆయన మంగళవారం మూలపేటలో నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా నిర్వాసితుల నుంచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మిగిలిన 41 ఎకరాలు వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని రైతులకు కోరారు. నిబంధనల ప్రకారం పరిహారం అందజేస్తామన్నారు. పోర్టు కోసం ఇచ్చిన 350 ఎకరాల భూముల రీ సర్వే కోసం కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో జీడి మామిడి చెట్లకు గతంలో కొంతమందికి పోర్టు యజమాన్యం చెల్లింపులు చేశారని మిగతా రైతుల వివరాలు సేకరించి వారితోనే పరిహారం చెల్లింపులు చేయిస్తామన్నారు. గతంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఆర్మీ ఉద్యోగులకు పూర్తిస్థాయి పరిహారం ఇప్పిస్తామని చెప్పి సంతకాలు తీసుకున్నారని, కానీ నిబంధనలు పేరు చెప్పి సగం సొమ్ము మాత్రమే చెల్లించారని పలువురు ఉద్యోగులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన నారం నాయుడు తనకు 11 ఎకరాల ఉంటే కేవలం రెండు ఎకరాలే రికార్డుల్లో చూపిస్తున్నారని వాపోయారు. దీనిపై మంత్రి స్పందిస్తూ పోర్టు నష్టపరిహారం పై అధికారులతో క్రాస్ చెక్ చేయించి గ్రామ సభలో వినిపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వరద బాధితుల కోసం డీసీసీబీ బ్యాంక్ ప్రతినిధులు రూ. 5 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, టెక్కలి ఆర్డీవో సుదర్శన్ దొర, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, రెవెన్యూ , పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డుల సస్పెన్షన్

శ్రీకాకుళం క్రైమ్ : విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు హోంగార్డులను ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి మంగళవారం సస్పెండ్ చేశారు. మరో ఐదుగురిపై నెల రోజుల పాటు సస్పెన్షన్ వేటు వేశారు. గత నెల 21న రూ.5 వేలు లంచం తీసుకున్నాడన్న కారణంతో పాతపట్నం కానిస్టేబుల్ శ్యామలరావును తాత్కాలికంగా సస్పెండ్ చేసిన ఎస్పీ.. ఈ క్రమంలోనే జిల్లా యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డుల పనితీరును కొద్దిరోజులుగా పరిశీలించి విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నవారి జాబితాను సిద్ధం చేసుకున్నారు. 17 మందికి నోటీసులు కూడా జారీ చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


యువకుడి మృతదేహం

కాశీబుగ్గ: పలాస జీఆర్‌పీ పరిధిలో కోటబొమ్మాళి-తిలారు రైల్వేస్టేషన్ల మధ్య ఈ నెల 17న రైలు నుంచి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు మంగళవారం తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు 9440627567 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైలు కింద పడి యువకుడు దుర్మరణం

పాతపట్నం: పాతపట్నం మహేంద్రతనయా నదిపై ఉన్న రైల్వే వంతెన వద్ద రైలు కింద పడి కాపుగోపాలపురం గ్రామానికి చెందిన యువకుడు రేగేటి రాజేష్ (32) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం గుణుపూర్ నుంచి రూర్కెల(రాజారాణి ఎక్స్‌ప్రెస్)రైలు కాపు గోపాలపురం దాటి పాతపట్నం మహేంద్రతనయా నది వంతెన ముందుకు వస్తుండగా రాజేష్ రైలు కింద పడ్డాడు. వెంటనే కొద్దిసేపు రైలు నిలిపివేశారు. అప్పటికే రాజేష్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు జయరామ్, జయలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. రాజేష్ ఇంజనీరింగ్ చదివి, విశాఖపట్నంలో ఉంటూ బిజినెస్ చేస్తున్నాడు. ఇటీవల వినాయక చవితికి స్వగ్రామం వచ్చాడు. ఇంకా వివాహం కాలేదు. అన్నయ్య భాగ్యరాజ్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. రాజేష్ ఆత్మహత్య చేసుకున్నాడా.. ప్రమాదశాస్తు జరిగిందా ఇంకా తెలియరాలేదు. స్థాక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైల్వే పోలీసులకు సమాచారం అందించారు.

ఎంపీడీఓల బదిలీలు

అరసవల్లి: జిల్లాలో సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా పలువురు మండల పరిషత్ అభివృద్ధి అధికారులను (ఎంపీడీఓ) బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండలాల వారీగా అధికారుల వివరాలివే...

అధికారి	పాత స్థానం	కొత్త స్థానం
వి.తిరుమలరావు	మందస	కంచిలి
పి.చంద్రకుమారి	మెళియాపుట్టి	పాతపట్నం
పి.సూర్యనారాయణ	కవిటి	మందస
ఎస్.రమేష్ నాయుడు	పలాస	వజ్రపుకొత్తూరు
సీహెచ్ ఈశ్వరమ్మ	వజ్రపుకొత్తూరు	సోంపేట
పి.వి.వి.మోహన్‌కుమార్	సరుబుజ్జిలి	సారవకోట
పి.వెంకటరాజు	ఆమదాలవలస	లావేరు
ఆర్.కాశీప్రసాద్	ఎల్‌ఎన్.పేట	హిరమండలం
ఎం.పావని	కొత్తూరు	సరుబుజ్జిలి
బి.శైలజ	హిరమండలం	శ్రీకాకుళం
కె.సురేష్‌కుమార్	లావేరు	సంతకవిటి
ఎస్.రామమోహనరావు	శ్రీకాకుళం	గార
జి.వి.రవికుమార్	సంతకవిటి	పోలాకి
ఎం.ఈశ్వరరావు	ఇచ్ఛాపురం	రణస్థలం
ఎస్.హరిహరరావు	పొందూరు	ఎచ్చెర్ల
వి.నీరజ	కంచిలి	కొత్తూరు
కె.అప్పలనాయుడు	విశాఖపట్నం	జలుమూరు
కె.వసంత్‌కుమార్	తూర్పుగోదావరి	పలాస
పి.తిరుపతిరావు	పశ్చిమ గోదావరి	బూర్జ
ఎం.మన్మధరావు	విశాఖపట్నం	పొందూరు
పి.నరసింహప్రసాద్	పశ్చిమ గోదావరి	మెళియాపుట్టి
పి.శ్రీనివాసరావు	విజయనగరం	ఎల్‌ఎన్.పేట
ఆర్.వెంకటరావు	విశాఖపట్నం	ఆమదాలవలస

బాహుదా నదిలో వ్యక్తి గల్లంతు


గిరిధారి బన్‌సాల్ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: బాహుదానదిలో పడి ఇటుకబట్టీ కార్మికుడు గల్లంతయ్యాడు. ఇచ్ఛాపురం మండలం బిర్లంగి ఇటుకబట్టీలో ఒడిశా రాష్ట్రం బొలంగిరి జిల్లా బాడిచూడెన్ గ్రామానికి చెందిన గిరిధారి బన్‌సాల్ (45) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం స్నేహితులు మోహిత్‌లాల్ బెహరా, రోహిత్ మాజి, డంచుగా బారియా, దినేష్ బారియాలతో కలిసి కిరాణ షాపులో సామాన్లు కొని బాహుదానదిలో స్నానం కోసం నదిలో దిగారు. ప్రవాహ ఉద్ధృతికి గిరిధారి బన్‌సాల్ కొట్టుకుపోయాడు. స్థానికుల సహాయంతో నదిలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. స్నేహితుడు మోతీలాల్ బెహరా మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి గాలింపు చేపడుతున్నారు.

అధికారుల నిలదీత


కర్లెమ్మ గ్రామసభలో అధికారులుకు నిలదీస్తున్న రైతులు

కొత్తూరు: రీ సర్వేలో తప్పుల నమోదుపై ఆగ్రహిస్తూ కొత్తూరు మండలం కర్లెమ్మ గ్రామ సచివాలయం పరిధిలోని రైతులు రెవన్యూ అధికారులను నిలదీశారు. సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు అధ్యక్షతన మంగళవారం తహశీల్దార్ పాపారావు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు, రైతులు జి.కృష్ణారావు, పి.యతిరాజు, సురేష్‌నాయుడు తదితరులు మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులు నమోదు చేయడం వల్ల సర్వ హక్కులు ఉన్నప్పటికీ భూములు తమ పేరిట రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భూముల పరిశీలనకు జేసీని తీసుకురావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌డీటీ అనంతరరావు, మండల సర్వేయర్ రమణయ్య, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఆర్‌ఐ లక్షణరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి


ర్యాలీలో మాట్లాడుతున్న పోతనపల్లి కుసుమ

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ, కుత్తుం హేమక్క, గర్ల జానకమ్మ డిమాండ్ చేశారు. మద్యం, డ్రగ్స్, అశ్లీల వెబ్‌సైట్‌లను ప్రభుత్వం నిషేధించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పలాస మండలం సూదికొండ కాలనీలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 27న శ్రీకాకుళంలో నిర్వహించనున్న పీవోడబ్ల్యూ జిల్లా 7వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘ జిల్లా నాయకులు బాలకృష్ణ మాధవరావు, అప్పయ్య, ప్రగతిశీల యువజన సంఘ జిల్లా నాయకులు సార జగన్, ఐఎఫ్‌టీయూ నాయకులు బర్ల గోపియాదవ్, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న కృషివిజ్ఞాన కేంద్రం సస్యరక్షణ నిపుణులు అనూష

సోంపేట: వరిలో కాలిబాటలు తీస్తే గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడులు సాధించే అవకాశముందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు సీహెచ్ వెంకటరావు, కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ నిపుణులు అనూష అన్నారు. సోంపేట మండలం పాత్రకొండ, కర్తలిపాలెం గ్రామాల్లో వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం పొలం బడి నిర్వహించారు. వరిలో కాలి బాటల ప్రాధాన్యం, పొటాష్ అవశ్యకత, చీడపీడల గుర్తింపు, నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, కర్తలిపాలెం సర్పంచ్ పొందూరు గున్నయ్య, బురద విశ్వనాథం, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.